క్లుప్తంగా

కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బిక్కవోలు: కుమార సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం షష్టి కావడంతో భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అభిషేకాల అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, రవి, సత్తిబాబు పాల్గొన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

సీతానగరం: చినకొండేపూడి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ చినకొండేపూడి ఫీడర్‌కు సంబంధించి చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ నిర్వహణ పనుల కోసం గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిపివేస్తామని రాజమహేంద్రవరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీపీబీ నటరాజన్ అన్నారు. ఆ సమయంలో సీతానగరం, చినకొండేపూడి గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

వైభవంగా బోనాల జాతర


బోనాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

కోరుకొండ (రాజానగరం): మండలంలోని శ్రీరంగపట్నం గ్రామ దేవత మోదా కొండమ్మ తల్లి బోనాల జాతర మంగళవారం వైభవంగా జరిగింది. సుమారు వెయ్యి మంది మహిళలు బోనాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు.

17న కంటి వైద్యశిబిరం

పెదపూడి: స్థానిక సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు చౌదరి తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శిబిరం జరుగుతుందన్నారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం వారిచే చత్వరం, తలపోటు పరీక్షలు చేసి మందులు ఇస్తారన్నారు. కంటిలో శుక్లాలు ఉన్న వారికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు ఉచితంగా చేస్తారన్నారు.

అధికారుల సర్వే

సీతానగరం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని రామాలయం వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు సర్వే నిర్వహించారు. ఏఈ వీరన్నబాబు తన సిబ్బందితో వచ్చి కొలతలు వేశారు. రామాలయంతో పాటు స్వీట్ స్టాల్ కూడా ఆర్ అండ్‌బీలో ఉందని నిర్ధారించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ఆదేశాలతో సర్వే చేశామన్నారు.

దుర్గాబాబు దేశ్‌ముఖ్‌కు నివాళి


దుర్గాబాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు

బిక్కవోలు: దుర్గాబాయి దేశ్‌ముఖ్ అందించిన సేవలు ఆదర్శప్రాయమని మెళ్లూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.లక్ష్మి అన్నారు. దుర్గాబాయి జయంతి సందర్భంగా మంగళవారం ఆ పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఆమె దేశానికి అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొలుగూరి వెంకట రామారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌గా బులిరెడ్డి

అనపర్తి: స్థానిక అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌గా సత్తి బులిరెడ్డిని అధిష్టానం నియమించిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం అనపర్తి ప్రెస్‌క్లబ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బులిరెడ్డికి నియామక పత్రం అందించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ దొరబాబు మంగళవారం తెలిపారు. సీఈటీ (ఒకేషనల్) గ్రూపునకు బోధించడానికి బీటెక్ (సివిల్) కోర్సు చేసిన వారు అర్హులన్నారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కళాశాలలో దరఖాస్తు అందజేయాలన్నారు. సంబంధిత గ్రూపులో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు.

అప్పుల తిప్పలు

- అన్నదాతల అవస్థలు
- పెట్టుబడి కోసం అప్పుల బాట
- సాయం అందించని కూటమి
- అన్నదాత సుఖీభవ ఎప్పుడిస్తారో!


వెదజల్లు సాగుకు సిద్ధమవుతున్న రైతులు


కైకవోలులో పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

పెదపూడి: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులపై కూటమి ప్రభుత్వం కనికరం చూపడం లేదు. అన్నదాత సుఖీభవ పథకం కింద అందిస్తామన్న పెట్టుబడి సాయాన్ని రెండేళ్లుగా అందించకపోవడం, పంటల బీమా ప్రీమియం సైతం రైతులే చెల్లించాలని ప్రకటించడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి సాయం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఎదురు చూపులు

ఖరీఫ్ సాగుకు పెట్టుబడుల కోసం రైతులు ఎదురు చూపులు చూస్తున్నారు. అన్నదాత సుఖీభవ సొమ్ము ఇంతవరకూ అందకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే సొసైటీల ద్వారా రుణాలు అంతంత మాత్రంగానే అందుతున్నాయని, గతంలో తీసుకున్న రుణం చెల్లిస్తేనే ఖరీఫ్‌కు రుణాలు ఇస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ రైతులు తమ అవసరాల మేరకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

తప్పని ప్రీమియం చెల్లింపు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు సకాలంలో రైతు భరోసా సొమ్మును వారి ఖాతాల్లో జమ చేసేవారు. సొసైటీల్లో, జాతీయ బ్యాంకుల్లో రుణాలు త్వరితగతిన మంజూరయ్యేవి. పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించేది. ప్రస్తుతం ఎకరాకు రూ.769.23 చొప్పున ప్రీమియాన్ని రైతులే చెల్లించాల్సి వస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ పంటకు ఆగస్టు 15 లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంది. దానికి రైతు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాతో పాటు ఈ - క్రాప్ నమోదును ఆర్‌ఎస్‌కేల వద్ద తీసుకుని ప్రీమియం చెల్లించాలి. దీంతో కొందరు రైతులు ప్రీమియం చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. నియోజకవర్గంలోని అనపర్తి మండలంలో 12 వేలు, బిక్కవోలులో 13 వేలు, పెదపూడిలో రూ.18,500, రంగంపేటలో 6,200 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి



పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలి. కౌలు రైతులకు ప్రీమియం చెల్లించే విధానం లేక కొందరు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మాదిరిగా బీమా ప్రీమియాన్ని కూటమి ప్రభుత్వం చెల్లించి రైతులను ఆదుకోవాలి. అన్నదాత సుఖీభవ సొమ్ము వెంటనే అందజేయాలి.

– మార్ని వెంకట్రావు, రైతు, పెదపూడి

విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించాలి


హెచ్‌ఎంలకు సూచనలు చేస్తున్న డీఈఓ


శిక్షణకు హాజరైన ఉమ్మడి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు

రాజానగరం: పాఠశాలలో పిల్లలకు మూడో తరగతి చివరి నాటికి చదవడం, రాయడంతోపాటు సంఖ్యలతో పరిజ్ఞానాన్ని సాధించేలా వారిలో అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు మండలంలోని మల్లంపూడి, సాయిమాధవి ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న శిక్షణా తరగతులను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలను వృద్ధి చేయడంతోపాటు, విద్యార్థుల సంఖ్యను కూడా పెంపొందించే దిశగా ప్రయత్నించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రంపై దృష్టి పెట్టడం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడం చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 176 మంది ప్రధానోపాధ్యాయులు శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు. తొమ్మిది మంది డీఆర్పీలుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి గౌరీశంకర్రావు, అనపర్తి ఎంఈఓ సత్తిరెడ్డి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన పెంచుకోవాలి


అనపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది

అనపర్తి: డెంగీ నివారణకు దోమల పునరుత్పత్తిని నియంత్రించడమే మేలైన మార్గమని సీహెచ్‌ఎస్ లక్ష్మి అన్నారు. స్థానిక 4వ సచివాలయం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డెంగీ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు కుట్టకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, నీటి కుండీలపై మూతలు ఉంచాలని, ఇంటి ఆవరణలో చెత్త, టైర్లు, ఎండిన కొబ్బరి బొండాలు, పూల కుండీలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనారోగ్య లక్షణం కనిపించిన వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. అనంతరం డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బి.నిర్మల, ఎంపీహెచ్‌ఏ వై.డేవిడ్, టి.అనురాధ, కె.మణి, వి.రాజకుమారి, జె.నీలిమ పాల్గొన్నారు.

సాగులో అధిక దిగుబడులు సాధించాలి


రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ సత్యప్రసాద్

పెదపూడి: వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించడానికి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ మండలాధికారి ఎస్.సత్యప్రసాద్ అన్నారు. ఏపీత్రయం గ్రామంలో మంగళవారం వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖాధికారుల సూచనలు, సలహాలను రైతులు పాటించాలన్నారు. తద్వారా తక్కువ పెట్టుబడితో అధిక, నాణ్యమైన దిగుబడులు సాధించాలన్నారు. సేంద్రియ సాగుపై దృష్టి సారించి, ఆరోగ్యకర పంటలు పండించాలన్నారు. అధిక మోతాదులో ఎరువులు, పురుగుమందులు వాడకూడదన్నారు. రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేసి, పొలం గట్లపై నాటించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆడబాల అనురాధ, గ్రామ పెద్దలు ఆరుమిల్లి సత్యభారతి ప్రసాద్, గుండా బాలాజీ, పెండెం అప్పన్న, రాజు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటన


జి.మామిడాడలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ప్రతినిధులు

పెదపూడి: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా రీసెర్చ్ ఇన్వెస్టిగేషన్ కేంద్ర బృందం మంగళవారం జి.మామిడాడ, శహపురం పంచాయతీల పరిధిలో పర్యటించింది. ఆ బృందంలోని నేతి వీరభద్రరావు, నేతి సుమ తదితరులు గ్రామ సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాల్లో తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానం, వర్మీ కంపోస్టు తయారీని పరిశీలించారు. వారి వెంట ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓ మన్యం శ్రీనివాసు చౌదరి, సచివాలయ కార్యదర్శులు ఎస్.కనక నాగేంద్ర, చంద్రకళ, సబ్బెళ్ల కృష్ణారెడ్డి, డీపీఆర్‌సీ బృంద సభ్యులు అచ్చిరాజు, రామకృష్ణ , శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖైదీల కేసుల దర్యాప్తుపై సమావేశం


పోలీసు అధికారులకు సూచనలిస్తున్న సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత కోర్టు ఆవరణలో మంగళవారం అండర్ ట్రైల్ రివ్యూ కమిటీ, ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ నిర్వహించారు. విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు, ఛార్జిషీట్ ఫైల్ చేసే విషయంలో పోలీసు అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. ఖైదీలు జామీను విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ మీటింగ్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాచరణ, బాధితుల పరిహారాల కేసులపై సునీత చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, అడిషనల్ ఎస్పీలు ఏవీ.సుబ్బరాజు, ఎన్‌బీకే.మురళీకృష్ణ, కాకినాడ పోలీసు అధికారి మనీష్‌దేవ్ పటేల్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఎస్పీ సాయిప్రశాంత్, జీపీ సురేందర్ ప్రసాద్, జిల్లా కోర్టు పీపీ రాధాకృష్ణంరాజు, డీఆర్‌వో టి.సీతారామమూర్తి, సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, మహిళా జైలు అధికారులు, రెవెన్యూ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


జేసీకి వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

సీటీఆర్ఐ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేజీకే మూర్తి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వెలిడేషన్ అమెండ్‌మెంట్‌ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జేసీ చిన్నరాముడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లును రద్దు చేయకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా నష్టపోతారన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా 8వ పేకమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి పే రివిజన్ అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతుతో ఓ సమగ్ర ఆరోగ్య భీమా పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. నిరసనలో నగర యూనిట్ అధ్యక్షుడు కేకే సంజీవరావు, సహాధ్యక్షుడు కొండపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భౌతిక శాస్త్రంపై అవగాహన

కడియం: రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం వేమగిరి హైస్కూలు విద్యార్థులకు భౌతికశాస్త్రంపై విస్తృత అవగాహన కల్పించారు. ల్యాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కాలేజీ అధ్యాపకులు విద్యార్థులతో పలు ప్రయోగాలు చేయించారు. యాంత్రిక తరంగాల ప్రదర్శన, సౌరశక్తి ప్రయోగాలు, విద్యుత్ డైనమో సాయంతో యాంత్రిక శక్తిని విద్యుత్‌శక్తిగా మార్చడం తదితర ప్రయోగాలను వివివరించారు.

700 క్యూసెక్కుల నీరు విడుదల

సీతానగరం: సాగు అవసరాల కోసం పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి 700 క్యూసెక్కుల గోదావరి నీటిని మంగళవారం విడుదల చేశామని జలవనరులశాఖ ఏఈఈ వినోద్ కుమార్ అన్నారు. పథకం నుంచి రెండు మోటార్ల ద్వారా నీటిని వదలి, దేవీపట్నం నేలకోట వద్ద పుష్కర కాలువలోకి మళ్లించినట్టు తెలిపారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టొద్దు


పలివెల వీరబాబు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం బస్టాండ్ సెంటర్‌లోని దొమ్మేటి వారి రామాలయం, వెంకటేశ్వర స్వీట్ స్టాల్ విషయంలో రాజకీయ నాయకులు మత విద్వేషాలు రెచ్చగొట్టవద్దని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు అన్నారు. ఆయన మంగళవారం సీపీఐ ఎంఎల్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. రాజకీయ నాయకులు ప్రజా సమస్యలపై పోరాడాలే తప్ప, రోడ్డు కటింగ్‌లో పోయే దాని కోసం రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు.

ఇసుక అక్రమ నిల్వపై కేసు

బిక్కవోలు: బలభద్రపురంలోని విన్నర్ స్కూల్ యాజమాన్యానికి చెందని స్థలంలో అక్రమంగా చేసిన ఇసుక నిల్వపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవి చంద్ర కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ బలభద్రపురంలో 487 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉంచారని, దానిపై అధికారులు ఫిర్యాదు అందిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 9న జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారులు సంయుక్తగా తనిఖీ చేశారన్నారు. ఆ స్థలం యాజమాని సర్వసిద్ధి దుర్గాప్రసాద్‌ను ప్రశ్నించగా, ఆ ఇసుక తనది కాదని, కేవలం రెండు లారీ వరకూ నిల్వ చేసుకోవడానికి కొమరిపాలెం గ్రామానికి చెందిన మొండి వీర వెంకట అభినవ్‌కు అనుమతి ఇచ్చానన్నారు. దీంతో అధికారులు పరిశీలన చేయగా.. అభినవ్ బలభద్రపురంతో పాటు కొమరిపాలెంలో కూడా భారీ ఎత్తున ఇసుకను నిల్వ చేసినట్టు గుర్తించారు. భూగర్భ శాఖ అధికారి ఫణి భూషన్ రెడ్డి, స్థలం యజయాని దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుకను బలభద్రపురం రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

చేనేత వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు

రాజమహేంద్రవరం రూరల్: ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 30 శాతం నుంచి 67 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు ధరలు ఇస్తున్నారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి కార్మికుల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. లాలాచెరువు ఆప్కో విక్రయ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆప్కో మెగా సేల్స్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ వస్త్రాల్లో ఒకటైన చేనేత వస్త్రాలను తయారు చేయడం ద్వారా అనేక మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారన్నారు. చేనేత వస్త్రాలు శరీరానికి హాయిని కలిగించడమే కాకుండా ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదపడతాయన్నారు. అనంతరం వస్త్రాలను పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. భారత ప్రభుత్వం చేపట్టిన చేనేత బ్రాండింగ్ కోసం ప్రామాణికతను నిర్ధారించుకొని, ఉత్పత్తి చేతితో నేసినదేనా, ఇతర ప్రమాణాలకు అనుగుణంగా ఉందా అని ప్రభుత్వం ధ్రువీకరించిన తర్వాతే మార్కెట్లోకి విక్రయాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి ఆప్కో మండల వాణిజ్య అధికారి బి.హరి ప్రసాద్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్లకు అందని జీతాలు


డీటీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కొత్త పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు రీ-అపోర్షన్ మెంట్ కారణంగా ఈనెల జీతాలు అందలేదని ఏపీటీఎఫ్ తెలిపింది. రాష్ట్ర డీటీఏ ఆఫీసు నుంచి పొజిషన్ ఐడీలు రాగానే ఉపాధ్యాయుల జీతాలు త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఖజానాధికారి సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. దీనిపై డీటీవో స్పందిస్తూ రాష్ట్ర ఖజానా శాఖ నుంచి పొజిషన్ ఐడీలు రాగానే వారి ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కె.డేవిడ్ లివింగ్‌స్టన్, జిల్లా గౌరవాధ్యక్షుడు వి.అప్పయ్యశాస్త్రి, రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయబ్రహ్మం పాల్గొన్నారు.

రాయితీ పథకాలతో రైతులకు మేలు

- ప్రభుత్వాల ప్రోత్సాహాన్ని వినియోగించుకోవాలి
- మండల ఉద్యానశాఖ అధికారి నాగ దేవిశ్రీ


అల్లం నాగదేవిశ్రీ


రంగంపేట మండలంలో ఆయిల్ పామ్ తోటలో అంతర పంటల సాగు

రంగంపేట: ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీతో కూడిన పలు పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యానశాఖ అధికారి అల్లం నాగ దేవిశ్రీ కోరారు. ఆమె మంగళవారం విలేకరులకు పలు విషయాలు వెల్లడించారు. ఆ ప్రకారం.. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్ పామ్ (ఎన్‌ఎమ్‌ఈఓ–ఓపీ) అనే కార్యక్రమాన్ని రూపొందించింది. ఆయల్ పామ్ సాగు చేసేందుకు ఒక హెక్టారుకు 143 మొక్కలు అవసరమవుతాయి. ఒక్కో మొక్కకు రూ.193 ఖర్చు అవుతుంది. దీనికి ప్రభుత్వం నూరు శాతం రాయితీ అందిస్తుంది.

త్రికోణ పద్ధతిలో..

ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి మొక్కకు మొక్కకు మధ్య దూరం 9 మీటర్ల ఉండేలా త్రికోణ పద్ధతిలో నాటుకోవాలన్నారు. ఈ తోటలు ఫలదీకరణం చెందడానికి నాలుగేళ్లు పడుతుంది. ఈ నాలుగు సంవత్సరాలలో ఆయిల్ పామ్ మొక్కల మధ్య మొక్కజొన్న, మినుము, బొప్పాయి, అరటి, కూరగాయలు అంతర పంటలుగా పండించుకోవచ్చు. ఇలా అంతర పంటలు వేసినందుకు కూడా హెక్టారుకు ఏడాదికి రూ.5,250 చొప్పున నాలుగేళ్లకు రూ.21 వేల రాయితీ లభిస్తుంది. అంతర పంటలతో పాటు ఎరువులు, పురుగు మందులకు హెక్టారుకు ఏడాదికి రూ.5,250 చొప్పున నాలుగేళ్లకు రూ.21 వేలు అందిస్తారు. కోకోనట్ అభివృద్ధి బోర్డు (సీడీబీ) ద్వారా కొబ్బరి వేసుకున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం రాయితీ అందిస్తుంది.

రాయితీలు ఇలా..

మిషన్ ఆన్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస యోజన (ఆర్‌కేవీవై) ద్వారా పండ్ల తోటలైన మామిడి, జీడి మామిడి, బొప్పాయి, జామ, నిమ్మ, టిష్యూ కల్చర్‌లో అరటి, డ్రాగన్‌ఫ్రూట్, కొబ్బరిలో కోకో, ఆయిల్ పామ్‌లో కోకోకు సంబంధించి రైతు 5 ఎకరాల వరకు, పూల తోటలైన బంతి, గులాబీ, చామంతి, లిల్లీ, మల్లి తోటల రైతులు 2.5 ఎకరాల వరకు రాయితీలు పొందవచ్చు. చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా పండ్లు, పూల తోటల విస్తరణకు కార్యక్రమం చేపట్టిందన్నారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) ద్వారా డ్రిప్ వేసుకున్న చిన్న, సన్నకారు రైతులు ఎస్సీ, ఎస్టీకి చెందిన వారికి 5 ఎకరాల లోపు నూరు శాతం రాయితీ అందిస్తుంది.